# అభివృద్ధిని చూసి ఓటేయండి

- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దు
- బీఆర్ఎస్ హయాంలో ఎంతో అభివృద్ధి
- విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, అక్టోబర్ 25 : గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో ఎవరూ చేయనంతగా కోట్లాది రూపాయలతో రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఎన్నికల సమయంలో కొందరు కొత్త బిచ్చగాళ్లలాగా గ్రామాల్లోకి వచ్చి మాయమాటలు చెబుతారని, వారి మాటలు నమ్మవద్దని సూచించారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ, ఎమ్మెల్సీ కవిత, మంత్రి వేములప్రశాంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని అన్ని గ్రామాలు, గిరిజన తండాలకు బీటీ రోడ్లు వేశామన్నారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో మంచిప్ప రిజర్వాయర్ నిర్మిస్తున్నామని, పూర్తయితే బీడు భూములకు సాగు నీరందుతుందని తెలిపారు. డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వరకు రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్‌తో పాటు డివైడర్ మధ్యలో రకరకాల మొక్కల పెంపకం ప్రయాణికులను ఆకట్టుకుంటున్నదన్నారు. డిచ్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ధర్పల్లిలో వంద పడకల దవాఖాన, చీమన్‌పల్లిలో పీహెచ్‌సీ, చెక్‌డ్యామ్‌లు, వంతెనలు, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు నిర్మించినట్లు వివరించారు. చారిత్రక నిలయమైన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.63 కోట్ల నిధులతో చేపట్టిన మాధవ్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తయితే నిజామాబాద్ –హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఇతర అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు మొదటి విడుత దళితబంధు పంపిణీ చేశారని, రూరల్ నియోజకవర్గంలో 1109 మంది లబ్ధిదారులకు రెండో విడుత దళిత బంధు సైతం పంపిణీ చేసినట్లు చెప్పారు.

### 3 వేల మందికి గృహలక్ష్మి మంజూరు పత్రాలు..

గృహలక్ష్మి పథకం కింద 3 వేల మందికి రూ. 3 లక్షల చొప్పున మొత్తం రూ. 90 కోట్లు మంజూరు చేసి పత్రాలను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. 1100 మంది దళితబంధు లబ్ధిదారులకు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.110 కోట్లు అందజేశామని వెల్లడించారు. ధర్పల్లి మండలకేంద్రంలో రూ.33.15 కోట్లతో వంద పడకల దవాఖాన నిర్మాణ పనులు, సిరికొండ మండలం చీమన్‌పల్లిలో రూ.2.50 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణ పనులు, సిరికొండ మండల కేంద్రంలో రూ.5 కోట్లతో ఐటీఐ మంజూరు, డిచ్‌పల్లి మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.26 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీల నిర్మాణం, రూ.25 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు, మైనార్టీ బంధులో భాగంగా 300 మందికి రూ.లక్ష చొప్పున రూ.3 కోట్లు, బీసీ బంధులో భాగంగా 200 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున రూ.2 కోట్లు మంజూరు చేశామని వివరించారు. వీటితో పాటు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రోడ్లు, వంతెనలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించామని, రైతు బంధు, పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా, గొర్రెల పంపిణీ పథకాలను రూ.1500 కోట్లకు పైగా నిధులు వెచ్చించి, లబ్ధిదారులకు అందజేశామని వివరించారు.

# దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతులు జారీచేయాలి

■ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 25 : ఎన్నికల ప్రచారం కోసం వచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమతులు జారీ చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. మీడియా సర్టిఫికెట్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)జిల్లా స్థాయి సమావేశాన్ని కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం నిమిత్తం వచ్చిన దరఖాస్తులు, వాటిని పరిశీలించిన విధానం, జారీచేసిన అనుమతులు తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎంసీఎంసీ క్రమం తప్పకుండా పెయిడ్ న్యూస్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే ఎన్నికల ప్రకటనలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అభ్యంతర పోస్టులపై చర్చించి, తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో కమిటీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ 'ఆరు గ్యారంటీ'లను నమ్మితే ఆగమే

- కర్ణాటక ప్రజల లెక్క మనం మోసపోవద్దు
- తెలంగాణలో ఆదర్శవంతమైన పాలన కొనసాగుతున్నది
- రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ మళ్లీ రావాలి
- మాజీ ఎమ్మెల్సీ, రూరల్ ఎన్నికల ఇన్‌చార్జి వీజీగౌడ్



ధర్పల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్

ధర్పల్లి/ నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 25 : కాంగ్రెస్ చెబుతున్న అలవికాని ఆరు గ్యారంటీలను నమ్మితే ఆగమేనని, ప్రజలు వాటిని నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, రూరల్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలో, జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారమే పరమావధిగా అమలుకు సాధ్యం కాని గ్యారంటీలను చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. గ్యారంటీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిన కర్ణాటకలో పాలన అగమ్యగోచరంగా మారిందన్నారు. అలాంటి పరిస్థితులు తెలంగాణలో పునరావృతం కావొద్దంటే, కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దని సూచించారు. దేశానికే ఆదర్శవంతమైన పరిపాలన రాష్ట్రంలో కొనసాగుతున్నదని అన్నారు. ప్రజలు మెచ్చిన పథకాలు అందించడంలో కేసీఆర్‌కు ఎవరూ సాటి లేరన్నారు. కేసీఆర్ చేసేదే చెబుతారని, చెప్పింది తప్పక చేసి తీరుతారని చెప్పారు. దీనికి తోడు కేసీఆర్ ఇటీవల ప్రకటించిన మ్యానిఫెస్టోలో ఎన్నో అద్భుతమైన పథకాలను ప్రకటించారని అన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. రూరల్ నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిన బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే, ఇతర పార్టీల నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో 3 గంటల కరెంట్ కూడా ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేశామని రైతులు బాధ పడుతున్నారని గుర్తుచేశారు. అంతకు ముందు రూరల్ నాయకులు వీజీ గౌడ్‌ను తన నివాసంలో కలవగా పలు సూచనలు చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ధర్పల్లిలో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ నల్ల సారిక, ధర్పల్లి సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్, సొసైటీ చైర్మన్ చెలిమెల చిన్నారెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్‌గౌడ్, పోతరాజు, ఎస్‌పి లింగం, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

# మోస్రా రామాలయంలో కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి తల్లిదండ్రుల పూజలు



మోస్రా రామాలయంలో పూజలు చేస్తున్న కల్వకుంట్ల సరోజినమ్మ - విద్యాసాగర్ రావు దంపతులు

మోస్రా (చందూర్), అక్టోబర్ 25 : నిజామాబాద్ జిల్లా మోస్రా మండల కేంద్రంలోని రామాలయాన్ని కోరుట్ల నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ తల్లిదండ్రులు కల్వకుంట్ల సరోజినమ్మ, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు బుధవారం దర్శించుకున్నారు. పార్టీ నుంచి సంజయ్‌కు టికెట్ కేటాయించడంతో పూజలు నిర్వహించామని.. గతంలో కూడా ఈ ఆలయాన్ని దర్శించుకొని ప్రచారం ప్రారంభించడంతో గెలిచినట్లు తెలిపారు. దీంతో ఈ సారి కూడా ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. వీరి వెంట ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, వంగ సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.

# కామారెడ్డికి చేరుకున్న కేంద్ర బలగాలు




కేంద్ర బలగాతో మాట్లాడుతున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి, అక్టోబర్ 25 : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర బలగాలు కామారెడ్డి జిల్లాకు చేరుకున్నాయి. వారు ప్రజలందరిలో భద్రత భావాన్ని పెంపొందించేందుకు పట్టణ కేంద్రాల్లో ఫ్లాగ్ మార్చ్, కవాతు, చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సింధూశర్మతో బుధవారం సమావేశం నిర్వహించారు. మూడు కంపెనీల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాకు సంబంధించి పూర్తి అవగాహన కల్పించారు. కామారెడ్డి జిల్లా మ్యాప్ ద్వారా పొరుగు రాష్ట్రాల సరిహద్దులు, చెక్‌పోస్టులు, పోలింగ్‌స్టేషన్లు, జిల్లా స్థితిగతులపై వివరించారు. సమావేశంలో మూడు కంపెనీల అధికారులు ఇన్‌స్పెక్టర్ రాజ్ మోహన్‌సింగ్, మనోజ్ కుమార్, కంఖాన్ కప్ జో, కామారెడ్డి డీఎస్పీ ప్రకాశ్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, బాన్సువాడ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

# ఎడపల్లిలో నేడు సద్దుల బతుకమ్మ

- హాజరుకానున్న ఎమ్మెల్సీ కవిత
- గ్రామానికి చేరుకున్న ఆడపడుచులు, బంధువులు
- దసరా అనంతరం ఐదురోజులకు వేడుక నిర్వహించడం ఇక్కడి ప్రత్యేకత



ఎడపల్లి, అక్టోబర్ 25: మండలకేంద్రంలో నేడు (గురువారం) సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించునున్నారు. అన్ని గ్రామాల కన్నా భిన్నంగా ఇక్కడ సంబురాలు నిర్వహిస్తారు. దసరా అనంతరం ఐదు రోజుల్లోపు పౌర్ణిమకు ముందుగా సద్దుల బతుకమ్మను నిర్వహిస్తారు. ఏడు శివారు గ్రామాలతో ఏర్పాటైన ఎడపల్లిలో పండుగను నిర్వహిస్తారు. మండలకేంద్రంలోని దేశ్‌ముఖ్ గడి నుంచి బతుకమ్మల ఊరేగింపు ప్రారంభం కావడం ఆనవాయితీ. గతంలో దేశ్‌ముఖ్ గడి నుంచి సిపాయి తుపాకీ పేల్చిన అనంతరం దసరా, బతుకమ్మ, హోలీ ఉత్సవాలను ప్రారంభించేవారు. నిజాంకాలంలో 83 ఏండ్ల క్రితం దేశ్‌ముఖ్ గడి నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతున్నది. దసరాకు ఒకరోజు ముందు సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించేవారు. తుపాకీ పేల్చే సమయంలో హన్మంతు అనే సిపాయి మృతిచెందాడు. అప్పటినుంచి దసరా అనంతరం ఐదు రోజులకు సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్నారు. వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు ఘనంగా పండుగను నిర్వహిస్తారు. ఎడపల్లి మండలకేంద్రంలోని దాస్ హనుమాన్ మందిరం, వీర హనుమాన్ మందిరం వద నయాబాదిలో గ్రామంలోని మహిళలందరూ బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం నయాబాది గోవింద్‌పూర్ హనుమాన్ మందిరం వద్ద బతుకమ్మ చెరువులో నిమజ్జనం చేస్తారు.

### హాజరుకానున్న ఎమ్మెల్సీ కవిత

ఎడపల్లిలో గురువారం నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ సంబురాలకు ఎమ్మెల్సీ కవిత హాజరు కానున్నట్టు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా సైతం హాజరవుతారని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకను విజయవంతం చేయాలని కోరారు.

### ఎడపల్లిలో ప్రత్యేకం.. బతుకమ్మ సంబురాలు



ఎడపల్లి మండలకేంద్రంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక స్థానం ఉన్నది. మా గ్రామంలో ఎక్కడా లేని విధంగా మహిళలతోపాటు పురుషులు కూడా ఈ సంబురాల్లో పాల్గొంటారు. వివిధ రకాల పూలతో భారీ బతుకమ్మలను పేర్చి, మహిళలు ఆటపాటలతో ఘనంగా పండుగను నిర్వహిస్తారు. ఈ సారి బతుకమ్మ వేడుకకు ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా రాకతో మరింత ఘనంగా నిర్వహిస్తాం.

-రజితా యాదవ్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్